# 'ఇది నా న్యాయం'

సి. సుజాత

ఎత్తుగా పెరిగిన మొక్కజొన్న చేలోంచి, బయటికి వచ్చేసరికి దూరంగా గట్టుమీద నీరసంగా నడుస్తూ వస్తున్న సూరి కనబడ్డాడు కోటయ్యకు.

'అరే! ఏంటీ ఈడు వత్తన్నాడు! మాలచ్చి ఏడకు బోయిందో!' అనుకొంటూ సూరికి ఎదురు నడిచేడు కోటయ్య.

చేతిలో టిఫెన్ కారేజీ కోటయ్యకు అందించి, ఆ గట్టుమీద కూర్చుండిపోయాడు సూరి ఆయాసంతో.

"ఏందిరా! నువ్వొచ్చినావూ! మీ యమ్మ ఏడకు బోయిందీ! ఈ మద్దినేల ఎండకు బడి రాకబోతే ఏమవుతాదీ... ఓర్నాయన... అసలే... ఒంటూపిరి గాడివి... ఇప్పుడే కూటికి ఇంత తొందర వచ్చేనా ఏందీ!..."


"టిఫినీ కుమ్మరోళ్ళ బాలయ్య తీసుకుపోతానన్నాడయ్యా... మరే... పెద్దరుగుల బాలరాజు గారు లేరూ, పొద్దుటేల మనింటికాడి కొచ్చేడయ్యా...'మీ నాయన ఆ కుంట దగ్గర చేను అమ్మనన్నాడంట ఏంట్రా...' అంటూ కేకలేసినాడయ్యా...'పుగాకు ఏపినం, అమ్మేందుకు గాదు' అంటే సాలా సేపు తిట్టేండు. నీకు సెప్పాలనీ..."

సూరి ఆగిపోయాడు ఆయాసంతో.

కొడుకు ఆయాస పడుతుంటే కోటయ్యకు నిస్సహాయత్వంతో ముందుగా కోపం వచ్చింది.

"ఏందంట ఈన దాష్టీకం...అమ్మనో అంటే ఎంట బడతాడు. పిలగాడికి ఆరోగ్గెం సరి లేక, వైద్దిగానికి పైసలు కోసం, ఇంత కష్టం చేత్తుంటే మాటికోపాలి.. అమ్మో అంట దు... ఓరి సూరే... నువు ఈపాలి ఒత్తే సెప్పు... నే మాట్టాడతా" అన్నాడు బక్క కోపంతో. నిజానికి కోటయ్య చేయగలిగేది ఏమీ లేదు. సూరికి గుండెజబ్బు. వాడికి వైద్యం చేయించడం శక్తికి మించిన పని కోటయ్యకు. వుండేందుకు వున్న గుడిసె దగ్గర మంచి అమ్ముకున్నారు. కాగా, పోగా చెరువు ఆనుకుని వున్న అరెకరం పొలం మటుకు మిగిలింది. బాలరాజుకి వున్న యాభై ఎకరాల ఏక ఖండంలోనూ ఆ అరముక్క కంట్లో నలుసు లాగా మిగిలిపోయి వుంది. అదీ కలిస్తే బావుండువని అతని యోచన. ఆ కాస్త మిగుల్చుకోవాలని ఇతని ఆలోచన. కుర్రాడికయ్యే ఆపరేషన్ ఖర్చుకని ప్రాణం ధారపోసి, కూలి చేసి, లక్ష్మి, కోటయ్య కలసి సంపాదించిన డబ్బంతా ఆ అరెకరం లోనే పెట్టుబడి పెట్టి వుంది. పుగాకు ఏపుగా పెరిగి వాళ్ళ ఆశలకు ఊపిరి పోస్తోంది. కోటయ్య జొన్న తోటకు కాపలాకు పోయినా, లక్ష్మి కూలికి పోయినా, వాళ్ళిద్దరి ఆరోప్రాణం ఆ పొగాకు చేలో వదిలేసే.

లక్ష్మి చీకటి పడే వేళకు పొలం నుంచి వస్తుంటే బాలరాజు కేకలు వేశాడు.



"ఏందే... నీలుగు... తిప్పి కొడితే మంచవంత చేను... దాన్ని వదలనని అంత పట్టుదల ఏంటంట. ఏదో చేలో చేను కలుస్తుందని కానీ..."

అతను చెప్పే తిట్లు, కబుర్లు అన్నీ విన్నాక, లక్ష్మి చాలా వినయంగా అతనికి నచ్చ చెప్పబోయింది.

"అది ఈ వరికే పెద్ద రెడ్డికి తనకా ఎట్టేవయ్యా... పిలగాడికి రోగానికే ఏడ డబ్బులు నూర్చుకుపోతూ వున్నాయి. ఆప్రేషన్ అయితే కుర్రాడు కాస్త లేసి తిరుగాడతాడని ఆసుందయ్యా.. అందుకే వళ్ళిరుసుకోని పన్లకు పోటం... నీకు అమ్మితే ఆయన ఎట్టూరు కొంట దు..."

'పెద్ద రెడ్డిని కాస్త ఇరుకున పెట్టాలని కోరిగ్గావీ లేకపోతే ఆ ముక్క ఎవడికి కావాలీ...' అనుకొంటూ "ఓర్నీ దుంప తెంబరి.. నాకు తెలియకనే అడిగేసినా



మద్రాసు మ్యూజిక్ అకాడమీ హాలులో ఇటీవల కళాసాగర్ పదిహేనవ వార్షికోత్సవంలో భాగంగా జరిగిన ఫిలిం అవార్డుల ప్రదానంలో శ్రీమతి వైజయంతిమాల మంచి ఉత్తమ ఛాయా గ్రాహకుడిగా ('నిరీక్షణ' చిత్రం) బహుమతిని అందుకుంటున్న శ్రీ బాలుమహేంద్ర

నంట వా ఏందీ! ఆ తాకట్టు పైకం ఆడి మొకాన కొట్టి ఆ పొలం సంగతి నాకు వదలండీ...!''

''ముందే అమ్మమనిండయ్యా... ఇంకేదో ప్రేణం కొట్టకలాడి.. ఎప్పటికయినా ఇడిపించుకొంటాం అనుకుంటూ అప్పజేస్తిరి... ఇంకోరకంగా ఆయన ఒప్పుకుంటాడా.. మద్దెన పిలగాడి అప్రేషను... ఆ పొలం మీద ఎంత పెట్టుబడి పెడితివి. అయి సేతికి రావాల, కుర్రోడు దక్కాల...''

లక్ష్మి ఏడ్చేసింది సూరి గుర్తువచ్చి. లేచి తిరిగేందుకు, కడుపునిండా తినేందుకు కూడా ఓపిక లేదు వాడికి.

''ఇదిగో నువ్వే లిటిగేంటు లాగా మాట్టాడెస్తే సరిపోద్దా. సరే... పో... నీ మాత్రం నాకు సేత కాదే...'' బాలరాజు రంకె వేశాడు.

లక్ష్మి గుండె దడదడ మంది భయంతో.

''ఇద్దరు కామందుల మద్దెన మేం నలిగిపోతన్నాం. ఆరూ, మీరూ... అంతా ఒటి కాదా బాబూ. మాకు ఆరు సుట్టాలు, మీరు పైవోరూనా...'' అంది ఏడుపు గొంతుతో.

''ఆ సంగతి మాకు తెలుసులే పో... అది ఎట్టా సేతి లోకి లాక్కోవాలో నాకు తెలియదనుకోకు'' బాలరాజు లోపలకి వెళ్ళిపోయాడు.

లక్ష్మి ఇంటికి వచ్చేసరికి సూరి మూలుగుతున్నాడు. అంత దూరం నడిచేసరికి వాడికి ఆయాసం, నీరసం వచ్చింది. వాడు ఊపిరి అందక తన్నుకొంటుంటే ఏడుస్తూ వాడి దగ్గరే కూర్చుంది లక్ష్మి.

''డబ్బున్నోళ్ళకి రోగాలు రాక, తిండి లేనోలకి రోగాలేంది! ఏం బతికించుకొంటాం.. ఈ పంట వచ్చే దాకా ఈడు బతికుంటడా...''తలమొకొంటూ భోరు మని ఏడ్చింది లక్ష్మి.

* * * *

ఆ ఉదయం అందరూ పన్లోకి వెళ్ళాక గుడిసె బయట నీరెండలో పడుకొని వున్నాడు సూరి. బాలయ్య పరుగెత్తుకొంటూ వచ్చాడు.

''ఒరి సూరే... మీ అమ్మేదిరా...

''బాలరాజు ఆళ్ళ సేనికి నీళ్ళు పెట్టుకుంటా వున్నాడు. మీ మడిసెక్కల్లోంచి కాలువ దియ్యకుండా ఏకంగా గట్టు గొట్టేండు. పాతిక ఎకరాల సేను తడుస్తా నీళ్ళు పార్తా వుండాయి ఆయన సేలోకి. మొక్కలు అవజావ కూలిపోతూవుండాయి నీళ్ళు వస్తా వుంటే... పోయి సెప్పరోయ్...'' అన్నాడు.

''నేనా... నువ్వే సెప్పన్నా. మా యమ్మ తూర్పు మాగాణికి బోయింది, మా నాయన ఆ డొంకనే మొక్కజొన్న సేలో వుంటాడు.''

''నాకేడ కుదురుద్దిరా... నేను ఇంజన్ చెడిపోతే, ఊర్లోకి పోతన్నా. నాగ్గుదరదు...'' బాలయ్య పరుగులు తీశాడు. సూరికి కాళ్ళు చేతులు ఆడలేదు. తల్లి దగ్గరకు పోవాలన్నా, తండ్రి దగ్గరకు పోవాలన్నా వాడికి ఓపిక లేదు.

'కాస్త కాలవకి అడ్డం వేసి ఆపైన తండ్రికి చెపితె...' లేని ఓపిక తెచ్చుకుని, చెరువు గట్టున అడ్డం పడి నడవడం మొదలు పెట్టేడు వాడు. పొలం దగ్గరకు వచ్చేసరికి వాడి గుండెలు అలిసిపోయాయి. కాలవనీరు ఉధృతంగా పారుతోంది. మడిచెక్కల్లోంచి గట్టు కోసేస్తోంది నెమ్మదిగా. సగానికి సగం చెట్లు నీటి వేగానికి పడిపోయాయి. మామూలుగా నీళ్ళు అవసరం అయితే ఓ పక్క నించి కాలవ తీసి పెడతారు. అలా కాకుండా గండి కొట్టి వదిలేదు. తల్లి తండ్రి పెట్టుకున్న ఆశలు ధ్వంసం చేస్తూ చేను నీటిలో మునిగిపోతోంది. గండి మూసేందుకు ఓ అడుగు కూడా వేయక ముందే వాడికి తీవ్రమైన నెప్పి వచ్చింది. ఓ వూపున వాడు అడ్డంగా ఆ కాలవలో పడిపోయాడు. వాడు లేచేందుకు కూడా అవకాశం ఇవ్వకుండా నీరు ముంచేసింది వాడిని. కోటయ్యకి కబురు తెలిసి పరుగెత్తి వచ్చేసరికి మిగిలింది ధ్వంసం అయిపోయిన పొలం... తగలెయ్యటానికి మాత్రం పనికి వచ్చే కొడుకు శవం... వెనకే ఏడుస్తూ పరిగెత్తి వచ్చే లక్ష్మి ఓ క్షణం కేకలు ఆపి నిర్ఘాంతపోయి చూచింది. ఆమె తేరుకుని చూచేసరికి కోటయ్య లేడు.

కోటయ్యకు బాలరాజు ఇంటి గుమ్మం దగ్గరే ఎదురయ్యాడు.

''పొలం గావల్నా ఏందీ...'' అన్నాడు కోటయ్య.

''ఏందిరోయ్ జోరు... బుర్ర తిన్నగా వచ్చింది లాగుందే...''

''సేలో నీళ్ళేందుకు రానిచ్చినవో...'' సూటిగా అడిగేడు కోటయ్య.

''ఎందుకు రానిచ్చేదేందిరా... చేనికి నీళ్ళు పెట్టుకోవడం ఎందుకు'' అన్నాడు బాలరాజు.

''నా సేలోంచి ఎందుకు అవీ...''

''ఏడ వరస గుదిరితే ఆడ పెడతారు. అదీ నీ ఇష్టం ఏందంటా?!''

''అదే నేనూ సెప్పన్న.ఆ వరస ఈడ కుదిరింది మరి నాకు...''

కోటయ్య చేతిలో పార బలంగా బాలరాజు తల బద్దలు చేసింది.

''ఎవరి కోసవో... ఎవడి మీదవో పగ తీర్చుకొనేందుకు నీకే బక్కాడే దొరికేడంటరా...''

చేతిలో పార విసిరి పారేసి వెనక్కు తిరిగేడు కోటయ్య... అవును మరి అది కోటయ్య న్యాయం.

''ఎంత పని చేస్తివి! ఇప్పుడేం దారి దేవుడోయ్...'' లక్ష్మి ఏడుపు వింటూనే ఒక్క కేక పెట్టేడు కోటయ్య.

''మద్దిన దేవుడెందుకు... కుర్రోడు పోయాడు, సేను ఎటు తిరిగీ పోద్దీ... ఈ బాగ్యేనికి భయం ఎందుకు! ఆయన సేసేది ఆయన సేయబట్టే, నాకు తోసింది నేను సేసి పారేశా...''

లక్ష్మి పిచ్చి చూపులు చూస్తోంది అతని వేపు. బాలరాజు భార్య... తల్లి... శోకాలు తీస్తూ పరుగెత్తి వస్తున్నారు. చుట్టు జనం క్షణంలో వచ్చేశారు. అందరి మధ్య నిలబడి వున్నాడు కోటయ్య.

''వీడికేదో పిచ్చి పట్టింది. పట్టుకోండి ముందు...'' కోటయ్య మీద పడి పట్టుకున్నారు కొందరు. దెబ్బ మీద దెబ్బ తగులుతోంది అతనికి. బక్క వూపిరి. మట్టిలో పడి పోతున్నాడు. పడి పోయినప్పుడల్లా బాలరాజు శవం తల పగిలి కనబడుతోంది అతనికి. అతడి మనస్సులో చెరువు నీళ్ళలో గండికి అడ్డంగా కొట్టుకొచ్చి నీలుక్కుపోయిన కొడుకూ కనబడుతున్నాడు. కొడుకును తలచుకుని, బాలరాజునుచూస్తూ దారుణమైన దెబ్బలు తింటున్న కోటయ్య నవ్వుతూనే వున్నాడు. ●